

## వరి పొలంలో రాక్ పైథాన్ కలకలం

**ఉద్యమ కెరటం, సిర్పూర్ టీ :** సిర్పూర్ టి మండలంలోని ఆచెల్లి గ్రామంలో రాక్ పైథాన్ (కొండచిలువ) బుధవారం కలకలం సృష్టించింది. గ్రామ సమీపంలోని ఓ వరి పొలంలో భారీగా ఉన్న ఈ కొండచిలువ కనిపించడంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వారు స్థానికుల సహాయంతో ఆ కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులు ఆ రాక్ పైథాన్‌ను ఎవరికీ హాని కలగకుండా, దాని సహజ ఆవాసమైన పెద్దబండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో సెల్ షాపు దగ్ధం

**ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం ● అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందన**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు శ్రీబాయ్ సెల్ ఫోన్ దుకాణం పూర్తిగా దగ్ధమైంది. యజమాని దుకాణాన్ని మూసివేసిన తర్వాత అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రాత్రి సమయంలో దుకాణం నుండి దట్టమైన పొగతో పాటు మంటలు ఎగసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే మంటలను ఆర్పివేశారు. వారి సకాలంలో స్పందన కారణంగా మంటలు చుట్టుపక్కల దుకాణాలకు వ్యాపించకుండా నిరోధించగలిగారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దుకాణంలో ఉన్న విలువైన మొబైల్ ఫోన్లు, మొబైల్ పరికరాలు, ఇతర సామాగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు ఐదు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలి



**ఉద్యమ కెరటం, వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలోని దాబా, సవాతీ, దొడ్డిగూడ, చిచ్చుపల్లి గ్రామాలలో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ అధికారికి వినతి పత్రాన్ని సమర్పించారు. బెల్ట్ షాపుల కారణంగా గ్రామాల్లోని యువత మద్యానికి బానిసై, కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని గ్రామస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. యువత భవిష్యత్తును, గ్రామాల ప్రశాంతతను కాపాడాలంటే అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులను వెంటనే ఎత్తివేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరీ చిరంజీవి పాల్గొని గ్రామస్తులకు మద్దతు తెలిపారు. అక్రమ బెల్ట్ షాపులను ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలోనే తనిఖీలు నిర్వహించి, అక్రమ బెల్ట్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అధికారులు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

## పోలీసు వాహనంలో వీడియో చిత్రీకరణ

**ఇద్దరు యువకులపై కేసు**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పోలీసుల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించి అనుమతి లేకుండా పోలీసు వాహనంలో కూర్చుని దిగుతున్న సమయంలో వీడియోలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న పోలీసు సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏరోడ్రం వద్ద ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పెట్రోలింగ్ వాహనం ముందుకు వెళ్లే పరిస్థితిలేని సమయంలో అదే అదునుగా పట్టణంలోని ఖానాపూర్ కు చెందిన షేక్ ఫయాజ్, మరో బాలుడు ఇద్దరు యువకులు ఆగి ఉన్న పోలీసు వాహనంలో అనుమతి లేకుండా కూర్చుని వీడియోలు చిత్రీకరించినట్లు తెలిపారు. అధికారి అనుమతి పొందకుండా వీడియోలను చిత్రీకరించి వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించిన నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు పరువు ప్రతిష్టలను భంగం కలిగించేలా వ్యవహరించే చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# మాజీ ప్రధాని ఇందిర గాంధీకి ఘన నివాళి





**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని ఆడే గజేందర్ క్యాంపు కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలను బోథ్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్, నేరడిగొండ మండల అధ్యక్షులు ఆడే వసంతరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం చేసిన అపూర్వ సేవలను దేశ నిర్మాణంలో ఆమె పాత్ర అమోఘమైందని కొనియాడారు. ప్రజల సంక్షేమమే ఆమె రాజకీయ జీవిత ప్రధాన ధ్యేయమైందని తెలిపారు. ఇందిరా గాంధీ నాయకత్వంలో జాతీయ భద్రత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయ రంగం సహా పలు కీలక రంగాల్లో భారత దేశం స్వాలంభన దిశగా అడుగులు వేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి, కోర్టికల్(కె) మాజీ సర్పంచ్ నగేష్, నాయకులు రమేష్ రెడ్డి, కపిల్ దేవ్, శంకర్, బానోతు వసంత్ రావు, రాథోడ్ వసంత్ రావు, విలాస్, రఘునాథ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇందిరా గాంధీ సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మావలలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఆమె దేశ ప్రధానిగా చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మండల అధ్యక్షులు మరసుకోలా గౌతమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ అలీమ్, మాజీ కోఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, సీనియర్ నాయకులు రెండ్ల రాజన్న, కొరటి ప్రభాకర్, రహీమ్ ఖాన్, అన్నం సంటెన్న, ఇమ్రాన్ ఖాన్, ఎండీ వసీం తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణ అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సుగుణ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో ప్రాణాలు త్యాగం చేస్తే, ఆ తర్వాత అనంతరం దేశ సమగ్రత, ఐక్యత కోసం తన ప్రాణాలు త్యాగం చేసిన ఘనత ఇందిరా గాంధీది అన్నారు. చివరి రక్తం బొట్టు వరకు దేశ సమగ్రత కోసం కృషి చేశారన్నారు. ప్రతీ గ్రామంలో భూసేకరణ చేసి, ఇందిరమ్మ గృహ నిర్మాణం చేపట్టి పేదవాడి ఆత్మ గౌరవం కాపాడారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గృహ నిర్మాణ కార్యక్రమం కనుమరుగైందని, కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగపూర్ మాజీ సర్పంచ్ సునీల్ జాదవ్, పులిమడుగు ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సంతోష్ జాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు తిత్రే గోవింద్, రాజక్క, లలిత తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరా గాంధీ అందరికీ ఆదర్శం


**ఉద్యమ కెరటం, వాంకిడి:** భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి ఇంది రాగాంధీ అందరికీ ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. గరీబి హటావో అనే నినాదంతో దేశ మహిళలను జాగృతి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జమాల్పూర్ సుధాకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ మండోకర్ దాదాజీ, పట్టణ అధ్యక్షులు మండోకర్ అనిల్, యూత్ అధ్యక్షులు దుర్గం ప్రశాంత్, ప్రచార కార్యదర్శి సామేల రమేష్, ఓబీసీ మండల అధ్యక్షులు జాబరే గణేష్, సీనియర్ నాయకులు కోబ్రా కడే విలాస్, చునర్కర్ శివాజీ, బొట్టుపల్లి జయరాం, దికొండే మహేష్, కృష్ణ, పాండు, సంతోష్, కెనక సోము, సెల్వట్కర్ పెంటు, సీతారాం, సోమయ్య, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.





## ధ్యాన కేంద్ర భవనం మంజూరు చేయాలి

**ఉద్యమ కెరటం, కౌటాల:** ధ్యాన కేంద్ర భవనం మంజూరు చేయాలని మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన శ్రీ మాతాజీ ట్రస్ట్ సభ్యులు కోరారు. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే రూ.10 లక్షల నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూమి పూజ కార్యక్రమానికి స్వయంగా హాజరవుతానని తెలిపారు. అలాగే ధ్యాన కేంద్రం భవన నిర్మాణం కోసం 4 గుంటల భూమిని విరాళంగా అందిస్తున్న శ్రీ చాప్లే తిరుపతిరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ సిద్దాల దేవన్న, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నైతం శీతల్, సిద్ధి హనుమాన్ దేవస్థానం చైర్మన్ శ్రీ ఎల్ములే దత్తు పటేల్, గావుడే హన్మంతు, భోయార్ ప్రవీణ్, తాటిపల్లి శ్రీ మాతాజీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



## చీరల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో మహిళల ఉన్నతి-తెలంగాణ ప్రగతి కార్యక్రమం కింద చీరల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల అధికారులు కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. జిల్లాలోని 13,612 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,48,052 మంది మహిళలకు చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,04,379 చీరలు జిల్లాకు చేరినట్లు పేర్కొన్నారు. పంపిణీ షెడ్యూల్‌ను ఖరారు చేసి, లబ్ధిదారుల ఆధార్, ఫొటో, అవసరమైన వివరాల నమోదును తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశించారు. చీరల పంపిణీ సమన్వయంతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ రవీందర్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఏపీఎం, డీపీఎం, మండల సమైక్య అధ్యక్షురాలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



